ఆకట్టుకున్న ఘంటసాల సంగీత విభావరి

ఘంటసాలకు నివాళులర్పిస్తున్న ఎల్‌కెపి సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక లలిత కళాపరిషత్‌లో ఆదివారం నిర్వహించిన ఘంటసాల సంగీత విభావరి ఆహూతులు ఆకట్టుకుంది. ముందుగా ఘంటసాల శత జయంతి సందర్భంగా చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఎల్‌కెపి అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, సభ్యులు అసలాంబాషా, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ చంద్రశేఖర్

విద్వేష రాజకీయాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

ప్రజా చైతన్యంతోనే ఫాసిస్ట్ పాలకులకు స్వస్తి

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశం, రాష్ట్రంలో నెలకొన్న విద్వేష రాజకీయాలతో వారి స్వార్థం నెరవేర్చుకోవచ్చే తప్ప.. ప్రజాస్వామ్యానికి మాత్రం పెను ముప్పుకు గురిచేస్తాయని పలువురు వక్తలు అన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎపి ఎన్జీవో హోంలో 'విద్వేష రాజకీయాలు-ప్రజాస్వామ్యం' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రతినిధి రవిచంద్ర అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ చంద్రశేఖర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం.బాషా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బోస్ ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజల సమ్మతం మేరకు పరిపాలన సాగడం లేదన్నారు. పాలకులు స్వార్థ రాజకీయాలు చేస్తూ ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలపెట్టారన్నారు. అధికారంలోకి వస్తే ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తాం, జన్‌ధన్ ఖాతాల్లో నల్లధనం తీసుకొచ్చి జమచేస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోడీ మాట మరిచారన్నారు. జి 20 గ్రూపు దేశాలకు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.. విశ్వగురువుగా ఎదిగామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప దేశానికి చేసింది శూన్యమని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు మత విద్వేషాలు సృష్టించి ముస్లిం సామాజిక వర్గంపై పెనుదాడి జరుగుతోందన్నారు. ప్రజల ఐక్యతను దెబ్బతిస్తూ బిజెపి తన పబ్బం గడుపుకుంటోందన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కుతూ దాడులు, హింసలు, హత్యలు వంటి అప్రజాస్వామిక విధానాలు అమలు చేస్తోందన్నారు. బిజెపి వెనుక 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్‌ఎస్ఎస్ ఉన్నంత కాలం ఇలాంటి పద్ధతుల్లో ప్రజాస్వామ్యంపై దాడులు జరుగుతూనే ఉంటాయని తెలిపారు. అధికార, ప్రతిపక్షాలు కూడా మోడీకి మోకరిల్లుతున్న దౌర్భాగ్యం రాష్ట్రంలో ఏనాడూ లేదన్నారు. ప్రజల పక్షాన నిలబడే వారిని బలపరచి ప్రజాస్వామ్య సుస్థిరతకు తోడ్పడుదామన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ అసమర్థ పాలకులు అధికారంలోకి వచ్చి అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలు మేలుకోకపోతే రాజ్యాంగ ఉనికి, విలువలు నాశనం అవుతాయని హెచ్చరించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బోస్ మాట్లాడుతూ దేశంలో సామాజిక అసమానతలు నెలకొన్నాయన్నారు. వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థలను తొలగించినప్పుడే నిజమైన సమానత్వం వస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలుచేసే నాయకత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలకు శ్రీకారం చడుదామన్నారు. అందులో భాగంగా ప్రజా చైతన్యం కోసం కళాసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్, గాంధీ తదితర మహనీయుల ఆశయాలపై కళా ప్రదర్శనలు ఉంటాయని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, మానవత తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ అబ్దుల్ రసూల్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర కమిటీ నాయకులు వెంకటనారాయణ, ముర్తుజా, ప్రకాష్, మసూద్, ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముస్కిన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, రామాంజినేయులు, ప్రజాశక్తి సాహితీ సంస్థ మేనేజర్ వేణుగోపాల్, జిల్లా ఇన్‌ఛార్జి మురళి, సిటీ ఇన్‌ఛార్జి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడు నాగభూషణం

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కణేకల్లు

అప్పుల బాధ తాళలేక ఓ రైతు తన పత్తి చేలులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అనంతపురం జిల్లా కణేకల్లు మండలంలోని తుంబిగనూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..కణేకల్లు మండలం తుంబిగనూరు గ్రామానికి చెందిన రైతు నాగభూషణం (47) కు ఒక ఎకరా సొంత భూమి ఉంది. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాడు. గత ఏడాది సరైన దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయాడు. ఈ ఏడాదీ పంటలు సాగు చేయగా అధిక వర్షాలకు దెబ్బతిన్నాయి. పంటల సాగు కోసం ఇప్పటి వరకు రూ.15 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు చెల్లించాలని రుణదాతలు మూడు నాలుగు రోజులుగా గొడవచేశారు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఆదివారం మధ్యాహ్నం తన పత్తి పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త భోజనానికి ఇంటికి రాకపోవడంతో భార్య సుంకమ్మ పొలానికి వెళ్లింది. విగతజీవిగా పడివున్న భర్తను చూసి ఆమె బోరున విలపించింది. మృతుడికి నలుగురు కుమార్తెలు. ముగ్గురికి పెళ్లిల్లు అయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి రైతు చిత్తు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తిపంట సాగు చేసిన రైతు పూర్తిగా చిత్తయ్యాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం పత్తి పంట ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగైంది. వేరుశనగ గిట్టుబాటుకాని పరిస్థితుల్లో పత్తి పంటవైపు క్రమంగా రైతులు మొగ్గుచూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతూపోతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 1.11 లక్షల ఎకరాల్లోపే ఉంది. అయితే ఈ ఏడాది 200291 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. అంటే దాదాపు రెండింతలు పత్తి పంట సాగైంది. ప్రత్యేకంగా అనంతపురం జిల్లావకు చూస్తే సాధారణ సాగు ఈ ప్రాంతంలో 1.11 లక్షల ఎకరాలు అయితే 1.90 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే సాధారణం కంటే 171 శాతం పత్తి పంట సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో సాధారణంగా 1712 ఎకరాల్లో సాగు అయ్యేది. ప్రస్తుతం పది వేల ఎకరాల్లో సాగు అయింది. ఈ జిల్లా పరిధిలో ఒకేసారి 523 శాతం పత్తి సాగు పెరిగింది.

దిగుబడుల దిగాలు..

ఎకరానికి విత్తనం మొదలుకుని పత్తి పంట తొలగించే వరకు ఎకరానికి సగటున రూ.50 వేల వరకు ప్రతి రైతూ ఖర్చు పెట్టాడు. ఎకరానికి సగటున ఎనిమిది నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాలి. కానీ చాలా చోట్ల మొగ్గలే ఏర్పాటవలేదు. మరికొన్ని చోట్ల మొగ్గ వచ్చినా అందులో పురుగు ఉండటంతో లోపల మొత్తాన్ని తినేయడంతో పత్తి ఏర్పడక పూర్తిగా దిగుబడి పోయింది. దిగుబడి ఏ మాత్రం చేతికందే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో పత్తి రైతులు ఆందోళనలో ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నేడు ఎపి రైతు సంఘం ధర్నా

విత్తనాలు..ప్రకృతి వెరసి రైతుకు నష్టం

జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున పత్తి పంట దెబ్బతినడానికి విత్తనాలు, ప్రకృతి రెండింటి వల్ల నష్టం జరిగిందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. నష్టం జరిగిన ప్రాంతాల్లో రెండు బృందాలు జిల్లాలోని తాడిపత్రి, పామిడి ప్రాంతాల్లో పర్యటించాయి. వారు పరిశీలించిన అంశాలను నివేదిక రూపంలోనూ అందజేశారు. ఇందులో విత్తనాల నాణ్యతాలోపాలూ ఉన్నట్టు కొన్నిచోట్ల గుర్తించారు. ప్రధానంగా అరికార రకం విత్తనంలో లోపాలున్నట్టు గుర్తించారు. మరోవైపు వర్షాలు అధికమవడం మూలంగానూ ప్రధాన నష్టం జరిగిందని అంచనా వేశారు. 70 రోజుల వ్యవధిలోనే 20 రోజుల్లో 300 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అధిక వర్షాలు, తేమ శాతం అధికమవడం మూలంగా 50 శాతం దిగుబడి పడిపోవడానికి కారణమని అంచనా వేశారు. ప్రధానంగా మూడు కోతల్లో పత్తి పంట దిగుబడి వస్తుందని నివేదికలో పేర్కొన్నారు. అందులో మొదటి కోతలో 50 శాతం, రెండో కోతలో 30 శాతం, ఆఖరి కోతలో 20 శాతం దిగుబడులు వస్తాయి. అయితే అకిరా రకంలో చూస్తే మొదటి కోతలో సున్నా నుంచి గరిష్టంగా ఒక క్వింటాళు దిగుబడి మాత్రమే వచ్చింది. ఇతర రకాల్లో మూడు క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చినట్టు గుర్తించామని శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలే ముంచాయా..

జిల్లాలో ఈ ఏడాది పత్తికి డిమాండ్ పెరగడంతో నకిలీ విత్తనాల జోరుగా సాగింది. ఖరీఫ్‌లో జిల్లాలో సాగైన వాటిల్లో అత్యధికంగా బయటి ప్రాంతాల నుంచి అనుమతుల్లేకుండానే కొంత మంది తెప్పించి అధిక ధరలకు రైతులకు అంటగట్టారు. ఈ పంట వేసి రైతులు నష్టపోయారు. ఇప్పుడు కొంత మంది రైతుల వద్ద విత్తనాలకు సంబంధించి బిల్లులు కూడా లేకపోవడంతో గట్టిగా విత్తన కంపెనీలను ప్రశ్నించలేని పరిస్థితులు నెలకొన్నాయి.

నేడు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

సిపిఎం మద్దతు

నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆందోళనకు సిపిఎం మద్దతు తెలుపుతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. విత్తనాల నాణ్యత, ప్రకృ వైపరీత్యాలు రెండింటి మూలంగా పత్తి రైతులు పూర్తిగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై జరిగే ఆందోళనకు అందరూ మద్దతు తెలుపాలని కోరారు.

పుట్లూరు మండలంలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు (ఫైల్ ఫోటో)

ప్రజల ఇంటి వద్దకే ప్రజా పంపిణీ వ్యవస్థ

ఆకలి రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వం లక్ష్యం

డిఎస్ఓ శోభారాణి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బియ్యం, చక్కెర, కందిపప్పు, ఉప్పు, చింతపండు, గోదుమలు, రాగులు, సజ్జలు, జొన్నలు, ఆయిల్, గ్యాస్ సిలిండర్ తదితర సౌకర్యాలు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే సేవలు అందించడం శుభపరిణామమని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శోభారాణి అన్నారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో పౌరసరఫరాల శాఖ సేవల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ప్రస్తుతం ఎన్ని రకాల సరుకులు ఇస్తున్నారు ?

జవాబు : బియ్యం, కందిపప్పు, చక్కెర, ఉప్పు వంటి సరుకులు అందిస్తున్నాం. గతంలో 14 రకాల సరుకులు ఇచ్చేవాళ్లం. ఆయిల్ ధరలు పెరగడంతో వాటిని సరఫరా చేయడం లేదు.

ప్రశ్న : రేషన్ డీలర్ వ్యవస్థ ఉంటుందా ?

జవాబు : తప్పకుండా ఉంటుంది. ఇంటింటికీ సరుకులు పంపిణీ చేసే వాహనాలతో పాటు రేషన్ షాపులు కొనసాగుతాయి. ప్రభుత్వం ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అయితే తొలుత వాహనాలు ఏర్పాటు చేశారు. రేషన్ డీలర్ వ్యవస్థ ఉండదన్న ఆందోళన చెందారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. స్వేచ్ఛగా ఎవరి పని వారు చేసుకుంటున్నారు. అందరూ కలిసి ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడమే కర్తవ్యంగా పని చేస్తున్నారు.

ప్రశ్న : రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు ఏమైనా జరుగుతున్నాయా?

జవాబు : గ్రామ వార్డు సచివాలయాలకు వెళ్లి రేషన్ కార్డు దారులు మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ అందుబాటులోనే ఉంది. అయితే స్లిట్ ఆప్షన్ ఇంకా రాలేదు. 2019-20 మధ్య నవశకం సర్వేలో 6 స్టెప్ సర్వే జరిగింది. ఆ తరువాత ప్రభుత్వం ప్రతి పేదవాడికీ న్యాయం చేయాలనే సంకల్పంతో ఉంది. ఆర్థికంగా బాగా ఉన్న వారికి సంక్షేమ ఫలాలు ఇవ్వడం సరికాదు. ఈ క్రమంలో కొన్ని నిబంధనలు అమలు చేయడం సహజం. అనర్హులు అక్కడక్కడా లబ్ధి పొందుతున్నారు. అర్హులకు అన్యాయం జరగకుండా వారికి ప్రభుత్వం నుంచి సహకారం అందించడమే లక్ష్యం.

ప్రశ్న : సిలిండర్‌పై అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. మీరేమంటారు?

జవాబు : ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నిర్ణయించిన ధరలకే వినియోగదారుల ఇంటికి గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలి. గ్యాస్ ఏజెన్సీ నుంచి గ్యాస్ వినియోగదారుని ఇంటి వద్దకు తీసుకెళ్తున్నందుకు ప్రభుత్వమే కొంత చెల్లిస్తుంది. అన్నీ కలుపుకుని గ్యాస్ ధర ఉంటుంది. అలా కాదని ఎవరైనా గ్యాస్ ఏజెన్సీ బాయ్స్ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటున్నాం. అపార్ట్‌మెంట్, మూడంతస్తుల భవంతులు, వృద్ధులు వంటి వారి ఇంట్లోకి సిలిండర్ చేర్చినప్పుడు వారి ఇష్టం మేరకు రూ.20 ఇస్తే తీసుకొచ్చు. ఇవ్వకపోతే డిమాండ్ చేయడానికి వీలులేదు. సేల్స్ ఆఫీసర్స్ పర్యవేక్షణ ఉంటుంది. తప్పులు జరిగితే తెలుసుకుని చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న : పెట్రోల్ పంపుల్లో కల్తీ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మీ సమాధానం ?

జవాబు : పెట్రోల్ పంపుల్లో కల్తీ చేస్తున్నట్లు వినియోగదారులు ఫిర్యాదులు చేస్తే తప్పకుండా తూనికలు కొలతలు, విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించి విచారణ చేపట్టి నిజంగా కల్తీ జరిగితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటున్నాం. రీడింగ్‌లో అవకతవకలు చేస్తున్నట్లు కొందరు ఆరోపణలు చేస్తున్నారు. మా దృష్టికి తీసుకొస్తే అలాంటి పెట్రోల్ పంపులను తనిఖీ చేసి సీజ్ చేయడం జరుగుతుంది. కమర్షియల్ ట్యాక్స్ శాఖ వారు అధిక మొత్తంలో జరిమానా విధిస్తారు. అలాంటి భయం ఉంది కాబట్టి పెట్రోల్ బంకులను సజావుగా నిర్వహిస్తున్నారు. అతిక్రమించే వారి పట్ల చట్టపరమైన చర్యలు తప్పవు.

ప్రశ్న : బియ్యం అక్రమ రవాణా నివారణ చర్యలు చేపట్టారా ?

జవాబు : చౌకధరల దుకాణం నుంచి ఇచ్చే బియ్యాన్ని కొందరు అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చినప్పుడు డిప్యూటీ తహశీల్దార్‌లు పర్యవేక్షించి టీంగా ఏర్పడి పట్టుకుని బియ్యం సీజ్ చేస్తున్నాం. జిల్లా సరిహద్దు గ్రామాల ద్వారా కర్నూలు, బనగానిపల్లి తదితర ప్రాంతాల నుంచి అక్రమ బియ్యం తరలిస్తున్న సందర్భంలో జిల్లాలో పట్టుబడుతున్నారు. చాలా కేసులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బియ్యమే ఉంటున్నాయి. అక్రమంగా బియ్యం ఎక్కడ నుంచి తరలించినా ప్రభుత్వం సహించదు. శాఖ తరుపున అలాంటి వాటిని ఉక్కుపాదంతో అణచివేస్తాం.

ప్రశ్న : ఆహార సలహా మండలి సమావేశాలు జరగడం లేదు ఎందుకు ?

జవాబు : ఆహార సలహా మండలి కమిటీ కాల పరిమితి పూర్తి అయింది. కొత్త బాడీ ఎన్నిక జరుగుతుంది. జిల్లాలో ఆయా రంగాల వారిని కమిటీలో చేర్చి వారి సలహాలు సూచనలు పాటించి ప్రజలకు మంచి సేవలు అందించడమే అందరి కర్తవ్యం. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సూచనలు, ఆదేశాలు జారీ చేస్తుంటారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సారథ్యంలో, జెసి నేతృత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థను సజావుగా నిర్వహించడమే కర్తవ్యంగా అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు.

సెక్టోరియల్ పోస్టుల నియామకాలు పారదర్శకంగా చేపట్టాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఎస్ఎలోని సెక్టోరియల్ పోస్టుల నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌లోని సెక్టోరియల్ పోస్టుల నియామకంలో మార్గదర్శకతకు తిలోదకాలు ఇచ్చినట్లు ఆనుమానాలు కలుగుతున్నాయన్నారు. సెక్టోరియల్ పోస్టుల నియామకం కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లో కొన్ని పోస్టులు చూపించకుండా భర్తీ చేయడం ఆపేక్షనీయమన్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన పోస్టుల నియామకంలో మార్గదర్శకాలు పాటించలేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. ఈనేపథ్యంలో అర్హత ఉన్నవారు, అర్హత లేని వారి వివరాలు గోప్యంగా ఉంచి నియామకాల కోసం ఇంటర్వ్యూలకు పిలవడం వెనుక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. 85 మార్కులకు కనీస ఉత్తీర్ణత మార్కులు ఎంత? కనీస ఉత్తీర్ణత లేనివారికి కూడా ఇంటర్వ్యూలు పిలవడం రాజ్యాంగబద్ధమా అంటూ ప్రశ్నించారు. కనీస ఉత్తీర్ణత లేని వారు ఉన్నప్పుడు మరొకసారి నోటిఫికేషన్ ఇవ్వడం ఆనవాయితీ అన్నారు. నిబంధనలు పాటించకుండా భర్తీ చేయడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి సెక్టోరియల్ పోస్టులను పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

5న డిఇఓ కార్యాలయం ఎదుట ధర్నా

జిల్లావ్యాప్తంగా ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు ప్లేస్‌మెంట్ కేటాయించిన తర్వాత మాత్రమే వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరగాలని శ్రీసత్యసాయి జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం ఎదుట ఈనెల 5న ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి బదిలీల్లో ప్లేస్‌మెంట్ ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు బదిలీల ప్రస్తావన లేకుండా వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో సర్దుబాటు ప్రక్రియ చేస్తున్నారని తెలిపారు. టీచర్లను దూర ప్రాంతాలకు వేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. మరో ప్రక్క హైస్కూల్స్‌లో సబ్జెక్ట్ టీచర్స్ అవసరం అంటూ ప్రమోషన్లు పొందిన వారికి ప్లేసులు ఇవ్వకుండా ప్రైమరీ నుంచి డెప్యుటేషన్స్ వేస్తున్నారని తెలిపారు. ఈ విధానాలను నిరసిస్తూ నేడు జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదుట సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా గౌరవ అధ్యక్షులు కె.భూతన్న, సహాధ్యక్షులు జి.హెచ్.బాబు, పిఎన్ సీతాలక్ష్మి, కోశాధికారి ఎం.సుధాకర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.మారుతి, శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు ఇ. నారాయణస్వామి, డి.శ్రీనివాసులు, సి.తాహెర్‌వలి, సి.హరికష్ణ, ఎస్.రమీజాబేగం, ఆడిట్ కన్వీనర్ పి.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

గుత్తి : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్నీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పట్టణ శివారులో ఉన్న జెడ్.వీరారెడ్డి కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోని జంగారెడ్డి రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఈ సభలకు ఎమ్మెల్సీలు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం దేశ,రాష్ట్ర నేతలు హాజరవుతారని వివరించారు. ఉపాధి, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున సభలకు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామంజి, బాలక్క, లక్ష్మి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న ఎపి వ్య.కా.సం నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఇదేం ఖర్మ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, టిడిపి నాయకులు

రెడ్ల చేతిలో నలుగుతున్న రాష్ట్రం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు నలుగురు వైసిపి రెడ్ల చేతిలో నలిగిపోతోందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని 6వ వార్డులో ఇదేమి ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైసిపి వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలనా వ్యవహారం అంతా విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతిలో ఉండటం బాధాకరమన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రం కార్యక్రమంతో ప్రజల్లో అనూహ్య స్పందన వస్తోందన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం బీసీల వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. టిడిపి ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జయహో బిసి నినాదాన్ని వైసిపి ప్రభుత్వం కాపీ కొట్టిందని ఎద్దేవా చేశారు. పేరుకే 56 నిధుల్లేని బిసి కార్పొరేషన్లను పెట్టి ఎలాంటి నిధులు ఇవ్వకుండా బీసీలను దగా చేస్తోందన్నారు. జగన్ క్యాబినెట్‌లో బీసీ లకు అన్యాయం జరుగుతోందన్నారు. బిసి కార్పొరేషన్లకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదని ఒక్క బిసి మంత్రి ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. మంత్రులు సిఎం జగన్‌కు కట్టుబానిసలుగా మారారని ఎద్దేవా చేశారు. సిఎం జగన్‌ను గద్దె దించి చంద్రబాబును తిరిగి సిఎంను చేయాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి పురుషోత్తం, కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతి, మాజీ కౌన్సిలర్లు హనుమంతు, భారతి, జ్యోతి, వెంకటేశులు, మహబూబ్‌బాషా, సుమలత, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆకుల'కు సంస్కార భారతి పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

ఆకుల రఘురామయ్య

జాతీయ ఉద్యమంలో తెలుగు సాహిత్యంపై సంస్కార భారతి నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో సీనియర్ విభాగంలో ఆకుల రఘురామయ్య ప్రథమ స్థానంలో నిలిచి సంస్కార భారతి పురస్కారానికి ఎంపికయ్యారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవాల్లో భాగంగా కళల ద్వారా సమాజ హితం కోసం పాటు పడుతున్న అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో 'జాతీయోద్యమంలో అక్షర యోధులు' అనే వ్యాసాన్ని రాసిన ఆకుల రఘురామయ్యకు సర్టిఫికెట్, మెమెంటోతోపాటు నగదు పురస్కారాన్ని అందజేస్తున్నట్లు సంస్కార భారతి ప్రాంత ప్రధాన కార్యదర్శి గూటాల రామ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఈనెల 11న రాజమండ్రి సమీపంలోని కొవ్వూరు సంస్కృత కళాశాలలో పురస్కారం అందుకోనున్నారు. ఈమేరకు ఆకుల రఘురామయ్యకు ఉమర్ ఆలీషా సాహితీ సమితి అధ్యక్షులు రియాజుద్దీన్, సంస్కార భారతి లక్ష్మి, ఉపాధ్యాయురాలు శ్రీదేవి, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు సుంకర రమేష్, తెలుగు వెలుగు సాహితీ సంస్థ టీవీ రెడ్డి, తోట నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

బీసీ గర్జనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ఉరవకొండ

విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 7న నిర్వహించనున్న బీసీ మహాసభ గర్జనను విజయవంతం చేయాలని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, మండల కన్వీనర్ బసన్న, కరణం భీమిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో విజయవాడలో జరిగే జయహో బిసి మహాసభకు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో బీసీ కులాల నాయకులు, వైసిపి కుటుంబ సభ్యులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమేష్, నాయకులు దేశాయ్ సిద్ధార్థ, వీరన్న, ఎర్రిస్వామి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-నార్పల

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని దిసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు విమర్శించారు. ఆదివారం మండలం పరిధిలోని కేసేపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తోందన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రజలందరూ అష్టకష్టాలు పడుతున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అవినీతిని ఇంటింటికీ వెళ్లి వివరించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఇసుక సమస్య, పెరిగిన సిమెంటు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు, కరెంటు ఛార్జీలు, ఇంటి పన్నులు, బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న సంస్థ కార్యదర్శి రమ

పట్టణంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయదుర్గం పురపాలక సంఘానికి సంబంధించిన గ్రంథాలయ పన్ను రుసుం వసూలు చేయాలని, సభ్యత్వం ఎక్కువగా చేయాలని, ప్రతి పాఠశాల విద్యార్థులు గ్రంథాలయంలో సభ్యత్వం చేయించాలని సూచించారు. విద్యార్థులందరూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవేలా చూడాలన్నారు. ఆదివారం ఉయ్ లవ్ రీడింగ్ ప్రోగ్రాంలో భాగంలో భాగంగా పిల్లలతో స్టోరీలు చదివించి, కథ సమీక్షించి వినిపించారు.

స్విమ్మింగ్ పోటీలకు అనంత క్రీడాకారులు

ప్రజాశక్తి-అనంతపురం

స్విమింగ్ క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

ఈనెల 10, 11వ తేదీల్లో ఏలూరులో జరగనున్న 7వ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఆక్వాటిక్ అంతర్ జిల్లా ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కమిని రవిశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి ముత్యాల, ధన్యశ్రీ, జస్విన్ నాయుడు, పురందీశ్వరరాజులు, మోహిత్ నాగసాయి, వెంకట సాయి శ్రీకర్, అభిషేక్‌ను ఎంపికైనట్లు తెలిపారు. ఈమేరకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఉప అధ్యక్షులు రవీంద్ర, కార్యదర్శి రాజశేఖర్, గిరీశ్, స్విమ్మింగ్ అకాడమీ అధినేత వెంకటరెడ్డి, తదితరులు అభినందించారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి-పుట్లూరు

స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 8 మోటార్ సైకిళ్లను సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అనంతపురం ఆధ్వర్యంలో తాడిపత్రి సెబ్‌స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు రూ.3వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

హైకోర్టు ఏర్పాటు రాయలసీమ హక్కు

అధికార వికేంద్రీకరణతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి - మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు పాలకుల భిక్ష కాదని.. రాయలసీమ ప్రజల హక్కు అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి, వికేంద్రీకరణపై ప్రతిపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా టిడిపి 'తేలు కుట్టిన దొంగ'లా వ్యవహరిస్తోందని విమర్శించారు. అమరావతి అభివృద్ధి ఒక్కటేనా.. మూడు ప్రాంతాలకూ సమన్యాయమైన వికేంద్రీకరణా.. అనే విషయంపై తమ వైఖరిని తెలియజేయాలన్నారు. అధికార వికేంద్రీకరణతోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యంగా రాయలసీమలో హైకోర్టు కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రేపు (సోమవారం) కర్నూలులో నిర్వహించనున్న రాయలసీమ గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాయలసీమ గర్జనకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాల్సిన చారిత్రాత్మక అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మధుసూదన్, అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి కన్వీనర్ రమణ, జిల్లా అగ్రి అడ్వజరీ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, ఉరవకొండ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోయ సుశీలమ్మ, బెలుగుప్ప ఎంపిపి పెదన్న, కూడేరు ఎంపిపి నారాయణరెడ్డి, ఉరవకొండ ఎంపిపి చందా చంద్రమ్మ, విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి, జెడ్పిటిసి పార్వతమ్మ, కూడేరు అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ మేరీ నిర్మలమ్మ, నాయకులు బైరెడ్డి రామచంద్రరెడ్డి, రాకెట్ల అశోక్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, పాటిల్ నాగిరెడ్డి, ఆవులన్న సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే ప్రతిపక్షాల విమర్శలు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఐదేళ్ల పాలన మాటలకే పరిమితమైందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ ఆధిపత్య పోరుతో నిత్యం భయోత్పాతం సృష్టిస్తూ అభివృద్ధిని పట్టించుకోలేదని అన్నారు. ఆదివారం నగర సమీపంలోని ఎ.నారాయణపురం పంచాయతీలోని 18, 19 డివిజన్ల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు టిడిపికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలే ప్రాతినిథ్యం వహించి అవి చేస్తాం.. ఇవి చేస్తామని చెప్పి కాలం గడిపారు తప్ప చేసింది శూన్యమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.600 కోట్లతో నగరంలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. నగరానికి దీటుగా నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎవరి హయాంలో ఏం మేలు జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. రాష్ట్రంలో టిడిపికి నూకలు చెల్లాయని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందిస్తూ సీఎం జగన్‌కు మంచి పేరు వస్తుండడంతో ప్రతిపక్షాలు అసూయతో రగిలిపోతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ రాజ్యం తెచ్చామన్నారు. ఎక్కడైనా అర్హత ఉండి పథకాలు రాకుంటే సాంకేతిక సమస్యలను తొలగించే పథకాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు ప్రజల సంక్షేమం గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. మూడున్నరేళ్లుగా ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలను తాము చేపడుతుంటే కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం అధికారం అనుభవించాలన్న కాంక్షతోనే ఈరోజు సీఎం జగన్‌ను గద్దెదించాలని పిలుపునివ్వడం సిగ్గుచేటని అన్నారు. వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరోసారి విభజన వాదం రాకుండా ఉండేందుకు సిఎం జగన్ అడుగులు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే పరిపాలన రాజధానిగా విశాఖపట్నం, శాసన రాజధానిగా అమరావతి, న్యాయరాజధానిగా కర్నూలు నిర్ణయం తీసుకున్నామన్నారు.

అనంత యువకుడికి అరుదైన గౌరవం

ఐక్యరాజ్య సమితి యువ పురస్కారం అందుకోనున్న బిసాటి భరత్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని జిల్లా కందికాపుల గ్రామానికి చెందిన బిసాటి భరత్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈనెల 5వతేదీన న్యూ ఢిల్లీలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో యువ పురస్కారం అందుకోనున్నారు. ఈ పురస్కారం అందుకోబోతున్న మొదటి తెలుగు యువకుడు భరత్ కావగం గమనార్హం. పుట్లూరు మండలం కందికాపుల గ్రామానికి చెందిన బిసాటి ఆదినారాయణ, శారదాదేవి కుమారుడు బిసాటి భరత్ మారుమూల పల్లెటూరి నుంచి తన ప్రయాణం మొదలు పెట్టి జాతీయం సేవా పథకం, నెహ్రూ యువ కేంద్ర సంగతాన్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ద్వారా ఎన్నో యువత అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. భరత్ ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా యువజన అధికారిగా పనిచేస్తున్నారు. గ్రామీణ యువతకు నాయకత్వ లక్షణాలు, సాఫ్ట్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, లైఫ్‌స్కిల్స్‌పై ఉచిత శిక్షణ, యువతను రేపటి తరం నాయకులుగా తీర్చిదిద్దడానికి యూత్ పార్లమెంట్ తరచుగా నిర్వహిస్తున్నారు. అంతేగాకుండా యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలు నింపడానికి రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, మహిళా సాధికారత, బాల్యవివాహాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అజాది కా అమృత మహోత్సవం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై శిక్షణ తరగతులు, డిజిటల్ ఇండియా, మైగోవ్ వంటి ప్రతిష్టాత్మక కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు అంబాసిడర్‌గా చేస్తున్నారు.

ఘనంగా తాజ్ బంజారాస్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

నగరంలోని బెంగళూరు జాతీయ రహదారి పక్కన హార్మోని సిటీ ఎదురుగా డాల్ఫిన్ హోటల్ సంస్థలు, ప్రశాంతి కూలర్స్ అధినేత మెగావత్ వినోద్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంజారాస్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను, అమూసిమెంట్ పార్క్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో సువిశాల ప్రదేశంలో చక్కటి వాతావరణంలో తాజ్ బంజారాస్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పిల్లలు, పెద్దలు, మహిళలు అందరూ కుటుంబ సమేతంగా వచ్చి భోజనం చేసి ఆహ్లాదాన్ని పొందేలా హోటల్ ఉందన్నారు. బంజారాల్లో కూడా వినోద్ వంటి వారు వ్యాపార రంగంలో రాణిస్తుండటం ఆనందంగా ఆదర్శంగా ఉందన్నారు. అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ హోటల్ రంగంలో మంచి అనుభవం ఉన్న వినోద్ మరొక చక్కటి రెస్టారెంట్‌ను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. డాక్టర్ రామస్వామినాయక్ మాట్లాడుతూ రుచికరమైన, సుచికరమైన వంటకాలు అందిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్న వినోద్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎబిఎస్ నాయకులు అశ్వర్థనాయక్ మాట్లాడుతూ బంజారా బిడ్డ వినోద్ వ్యాపారంలో రాణిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. అంతకు మునుపు రెస్టారెంట్ ప్రొప్రైటర్ వినోద్‌కుమార్, సతీమణి తారా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎబిఎస్ఎస్ జాతీయ నాయకులు బాలానాయక్, రంగలాల్‌నాయక్, డివిఇఒ వెంకటరమణనాయక్, ఎఎస్ఐ తిరుపాల్‌నాయక్, ధర్మవరం రామునాయక్, దాసునాయక్, జివిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్‌నాయక్, ఆమ్‌ఆద్మీపార్టీ రాయలసీమ కో కోఆర్డినేటర్ శ్రవణ్‌నాయక్, బంజరా సంఘం శ్రీరాములునాయక్, వెంకటేశ్వర నాయక్ (గిరి), కిరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాద వాతావరణంలోఉన్న బంజారాస్ ఫ్యామిలీ రెస్టారెంట్

పారదర్శకత కోసమే భూహక్కు పత్రాలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

భూ హక్కు పత్రాలను అందజేస్తున్న సర్పంచి ఉల్లెమ్మ

వివాదాలకు తావు లేకుండా పారదర్శంగా ఉండాలనే ఉద్దేశంలోనే సిఎం జగన్ వైఎస్ఆర్ భూరక్ష పథకాన్ని తీసుకొచ్చారని సర్పంచి ఉల్లెమ్మ, డిప్యూటీ తహశీల్దార్ రఘు అన్నారు. ఈమేరకు ఆదివారం మండల పరిధిలోని మెచ్చిరి గ్రామంలో రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భూ వివాదాలు ఉన్నాయన్నారు. వాటిని సమూలంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే భూరక్ష పథకాన్ని తీసుకొచ్చారన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మెచ్చిరి చంద్ర, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

మృతిచెందిన వీరాంజనేయులు

ఉరవకొండ : విడపనకల్లు మండలం మాళాపురం సమీపంలోని 42వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరాంజినేయులు (25) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బెలుగుప్ప మండల గంగవరం గ్రామానికి చెందిన వీరాంజినేయలు బళ్లారికి వెళ్లి తిరిగి విడపనకల్లు మీదుగా గంగవరం గ్రామానికి వెళ్తుండగా మాళాపురం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా కంటైనర్ లారీ వచ్చి ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి గాయాలు..

గాయపడిన కృష్ణమూర్తి

బెలుగుప్ప : మండల పరిధిలోని తగ్గుపర్తి గ్రామానికి చెందిన వడ్డే కృష్ణమూర్తి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాలైన ఘటన బెలుగుప్ప-తగుపర్తి గ్రామాలు మధ్య ఆదివారం చోటుచేసుకుంది. పొలాల్లో పప్పుశెనగకు మందు పిచికారి చేస్తున్న రైతులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. బంధువులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

మట్కా బీటర్ల అరెస్టు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో నలుగురు మట్కాబీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి మట్కాబీటర్లు ప్రసాద్, సుబ్బురాజు, జయరాం, మల్లికార్జునను అరెస్టు చేసి రూ.18,150 నగదుతోపాటు మట్కా చీటీలు, పెన్నులు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్పై తెలిపారు.

6న పట్టుబడ్డ వాహనాలకు వేలంపాట

గుత్తి : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈనెల 6వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు సెబ్ సిఐ బి.వరలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుత్తి సెబ్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం బాటిళ్లు, నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు గుత్తి సెబ్ సర్కిల్ స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ల అసోసియేషన్ ఏర్పాటు

అనంతపురం : నగరంలోని జిల్లా పరిషత్ హాల్‌లో జిల్లాలోని సచివాయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ల అసోసియేషన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రెసిడెంట్‌గా ఉమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇషాన్, మహిళా ప్రెసిడెంట్‌గా అమృత, జనరల్ సెక్రటరీగా నరేష్, ట్రెజరర్‌గా సాగర్, వైస్ ప్రెసిడెంట్లుగా అనంతపురం డివిజన్‌కు చంద్రమౌళి, గుంతకల్లు డివిజన్‌కు వినయ్‌ప్రకాష్‌రెడ్డి, కళ్యాణదుర్గం డివిజన్‌కు మౌనిక, జాయింట్ సెక్రటరీలుగా అనంతపురం డివిజన్‌కు వెంకటరమణ, గుంతకల్లు డివిజన్‌కు విజయ్, కళ్యాణదుర్గం డివిజన్‌కు చందన, వెంకటరమణను ఎన్నుకున్నారు.

విద్యార్థినులకు పరామర్శ

విద్యార్థినులను పరామర్శిస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల : మండల కేంద్రంలోని కెజిబివిలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థకు గురైన విద్యార్థినులను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అనంతపురం ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు మంజుల, వైష్ణవి, రమ్య, మానస, భారతి, చంద్రకళ, మానస, వెన్నెల, నందినీని పరామర్శించి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అస్వస్థకు గురి కావడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

టిడిపితోనే బిసిల అభివృద్ధి

శింగనమల : తెలుగుదేశం పార్టీతోనే బిసిల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ బిసి నాయకులు ఎం.ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్లుగా వెనకబడిన తరగతులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఇప్పుడు జయహో బీసీ కార్యక్రమం నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి జయహో బిసి నినాదాన్ని వైసిపి కాపీ కొట్టి వాడుకోవాలని చూస్తోందన్నారు. నయవంచకమైన వైసిపి ఈనెల 7వతేదీన 5వేల మంది కూడా పట్టని ఇందిరాగాంధీ స్టేడియంలో 80 వేల మంది వస్తున్నారని డబ్బా కొట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం స్పందించి బిసిలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో వారే వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రహదారులు అభివృద్ధికి చిహ్నాలు

వర్చువల్ విధానంలో రహదారి పనులను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము

ప్రజాశక్తి-బుక్కపట్నం

రహదారులను అభివృద్ధి చేయడం ద్వారానే ఆయా ప్రాంతాల అభివృద్ధి చెంది పరిశ్రమలు ఏర్పాటవుతాయని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎన్‌హెచ్ 342 లో భాగంగా 32 కిలోమీటర్ల పనులను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విజయవాడలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బుక్కపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి చొరవతో సత్యసాయి జిల్లాలో రూ.175కోట్లతో రోడ్లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడత ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వరకూ రెండు లైన్లు అభివృద్ధి పనులరు శంకుస్థాపన చేశామన్నారు. అలాగే సెప్టెంబర్ 23వతేదీలోపు నియోజవర్గంలోని 193 చెరువులకు రూ.వెయ్యి కోట్లతో చెరువులు నింపే కార్యక్రమం చేపడతామన్నారు. గత పాలకులు అభివృద్ధిని మరిచి ప్రజలను మభ్య పెట్టారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో సిఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో గాజులపల్లి, నల్లగొండలో రెండు రిజర్వాయర్లను ఏర్పాటు చేసి అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం డైట్ కళాశాలలో నాడు-నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌డి మధుసూదన్‌రావు, సర్పంచులు నాగలక్ష్మి రాజు, రూప, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపిపి పార్వతి రత్నాకర్, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు కొత్తకోట కేశప్ప, కేశప్ప, నారాయణస్వామి, రామలింగారెడ్డి, అధికారులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : రిలయన్స్ డిజిటల్ పైన, 2వ ఫ్లోర్, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్ దగ్గర, అనంతపురం.
చలపతి ఎన్‌క్లేవ్, ఫస్ట్‌ఫ్లోర్, పరిగీల్ బస్టాప్ దగ్గర, హిందుపూర్
యాదవ స్ట్రీట్ మెయిన్‌రోడ్డు, సబ్‌జైల్ ఎదురు, ధర్మవరం
రాయదుర్గం :లక్ష్మీబజార్, అనంతపురం మెయిన్‌రోడ్డు, ఎపిజిబి బ్యాంక్ దగ్గర,రాయదుర్గం

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 27.12.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 3134.08 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798